సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ■ 4 ■ జూన్ ■ 2025



చీనీ టన్ను రూ.33,300

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళ వారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33,300, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



డీజిల్ అక్రమ డంప్ స్వాధీనం

రాత్రి వేళ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీల నుంచి డీజిల్ చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డీజిల్ అక్రమ డంప్ స్వాధీనం చేసుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
37.3°/22.1°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గి ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'ఉద్యాన' కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల

మడకశిర రూరల్: డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని ఉద్యాన పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు (2025–26 విద్యాసంవత్సరం) నోటిఫికేషన్ విడుదల చేసినట్లు స్థానిక ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీధర్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. https://drysrhu.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు సర్టిఫికెట్లను జత చేసి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కార్యాలయం చిరునామాకు పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు 7382633687, 7702705721 నంబర్లలో సంప్రదించాలన్నారు.

స్కూళ్లు తెరిచేలోపే పుస్తకాలు పంపిణీ



మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

నల్లమాడ: పాఠశాలల పునఃప్రారంభమయ్యేలోపు విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలానికి ఇప్పటికే 90 శాతం పాఠ్య పుస్తకాలు సరఫరా చేశామని, పాఠశాలలు తెరిచేలోపు తక్కిన 10 శాతం పుస్తకాలను కూడా సరఫరా చేస్తామన్నారు. అలాగే యూనిఫాం సైతం విద్యార్థులకు సకాలంలోనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా కూడా ఉపాధ్యాయుల కొరత లేకుండా ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. డీఈఓ వెంట ఉపాధ్యాయుడు బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

వెన్నుపోటుకు ఏడాది

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల డప్పు కొట్టి.. అధికారంలోకి వచ్చాక సామాన్యులు, పేదల పొట్టకొట్టిన కూటమి సర్కారు వెన్నుపోటుకు నేటితో ఏడాది పూర్తయింది. సరిగ్గా 2024 జూన్ 4వ తేదీన 'కూటమి'కి అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. 'మా హామీలు మీ జీవితాలనే మార్చేస్తాయం'టూ ఎన్నికల ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల్లో లేని ఆశలు కల్పించిన చంద్రబాబు, ఆయన పార్టీ పరివారం.. గద్దెనెక్కాక మాత్రం ముఖం చాటేశారు.

- అలవిగాని హామీలతో లక్షలాది మందికి కుచ్చుటోపీ
- ఎన్నికల ముందు ఊరూరా 'సూపర్‌సిక్స్' ప్రచారం
- అధికారంలోకి వచ్చాక ఒక్క పథకమూ అమలు చేయని వైనం
- పైగా కబ్జాలు, ఆక్రమణలు, మోసాలు, దోపిడీలతో భయభ్రాంతులు
- 'కూటమి' పాలనను ఎండగడుతూ నేడు వైఎస్సార్ సీపీ నిరసన ర్యాలీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందలేదు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని మోసగించారు. 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని నేడు ఆ విషయమే పట్టించుకోవడం లేదు. సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఉచిత బస్సుకు ముహూర్తమే ఖరారు కాలేదు. 'ఇంటింటికీ ఉద్యోగమిస్తాం.. ఉద్యోగం ఇవ్వకపోతే నెలకు రూ.3 వేలు భృతి' అన్నా నేటికీ అతీగతీ లేకుండా పోయింది. ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఇస్తామని ఇప్పటివరకూ పైసా ఇవ్వలేదు.

సామాన్యుల బెంబేలు..

అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు నెరవేర్చకపోగా ఎమ్మెల్యేలు, పోలీసులు, టీడీపీ కార్యకర్తలు, సామాన్యులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. కబ్జాలు, ఆక్రమణలు, దందాలు, అక్రమ వసూళ్లకు అంతులేకపోవడంతో జనం బెంబేలెత్తుతున్నారు.

- కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములతో ఉమ్మడి అనంత జిల్లాను మత్తులో జోగేలా చేశారు.
- హిందూపురంలో బాలకృష్ణ పీఏల అండ చూసుకుని ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.
- ఫ్యాక్షన్ హత్యలు మళ్లీ పురుడుపోసుకున్నాయి. రామగిరి మండలంలో కురుబ లింగమయ్యను పచ్చ మూకలు కొట్టి చంపాయి. రాప్తాడులో నారాయణరెడ్డి, ముత్యాలమ్మను టీడీపీ నేతలు నరికి చంపారు.
- ఉమ్మడి జిల్లాలో కొండలు, గుట్టల్ని 'తమ్ముళ్లు' పిండిచేసి సహజ వనరులను లూటీ చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో వివిధ పథకాల లబ్ధిదారులు ఇలా ..

పథకం	మోసపోయిన లబ్ధిదారుల సంఖ్య
వైఎస్సార్ రైతు భరోసా	2,79,556
సున్నా వడ్డీ పంటరుణాలు	1,71,275
వైఎస్సార్ ఉచిత పంటబీమా	2,96,541
ఇన్‌పుట్ సబ్సిడీ	12,099
జగనన్న తోడు	29,145
వైఎస్సార్ ఆసరా	23,365
వైఎస్సార్ సున్నా వడ్డీ	30,957
వైఎస్సార్ చేయూత	1,22,826
ఎస్‌హెచ్‌జీ బ్యాంకులింకేజీ	24,739
జగనన్న అమ్మఒడి	1,66,398
వైఎస్సార్ నేతన్న నేస్తం	16,813
జగనన్న విద్యాదీవెన	44,082
వాహన మిత్ర	85,790

గమనిక: చంద్రబాబు ప్రభుత్వంలో వీరిలో ఒక్కరికీ రూపాయి లబ్ధి చేకూరలేదు..

- చిత్రావతి, పెన్నా, వేదవతి హగరి నదుల్లో అక్రమంగా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు.
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారు.
- అనంతపురం అర్బన్‌లో ఎవరైనా ఇళ్లు కట్టాలంటే ఎమ్మెల్యేకు ట్యాక్స్ కట్టాల్సిన పరిస్థితి.
- మట్కా, గంజాయికి తాడిపత్రి నియోజకవర్గం అడ్డాగా మారిపోయింది.
- గుత్తిలో ఓ వ్యక్తిని టీడీపీ నేతలు రైలు పట్టాలపై పడుకోబెట్టి డబ్బు దండుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.
- రాప్తాడులో వెంచర్లు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే డబ్బు ముట్టజెప్పాలని చెబుతుండటంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అటువైపు చూడటమే మానేశారు.



నేడు వెన్నుపోటు దినం..

హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు తీరుకు నిరసనగా 'వెన్నుపోటు దినం' పేరుతో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసన ర్యాలీకి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజవర్గాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి నేతలు ర్యాలీలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కనున్నాయి.



నమ్మించి మోసం చేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తుందని ఆశపడ్డాం. కానీ ఏడాది పాలన పూర్తయినా 'సూపర్ సిక్స్'లో పేర్కొన్న ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంట్లో ఆడబిడ్డలకు నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి లాంటి ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేసింది.

– శ్రీవందన, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

ఆడపడుచులకు అన్యాయం



తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా కింద సున్నావడ్డీ రుణాలు మహిళలకు అందిస్తామని చంద్రబాబు చెప్పారు. ఎన్నికలప్పుడు కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కానీ వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఆడపడుచులను మోసగించారు. ఇలా అయితే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు మహిళలు తప్పకబుద్ధి చెబుతారు.

– హేమలత, రెడ్డివారిపల్లి, రామగిరి మండలం

హామీలన్నీ బూటకం



ఎన్నికల వేళ కూటమి నేతలు అలవిగాని హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా వాటి ఊసే ఎత్తడం లేదు. సూపర్ సిక్స్ హామీలన్నీ బూటకం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. నాలుగేళ్లలో రైతు భరోసా కింద రూ.1,62,000 ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ', తల్లికి వందనం పథకాలకు సైతం పంగనామాలు పెట్టింది.

– ఎంజీ అశ్వర్థనారాయణ, చిన్నబోయనపల్లి, కొత్తచెరువు మండలం

మోసపూరిత ప్రభుత్వమిది



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇంటింటికీ వచ్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని కరపత్రాలతో ప్రచారం చేశారు. ప్రజలు నమ్మి అధికారమిస్తే ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నేరవేర్చకుండా ప్రజలను మోసం చేశారు. సూపర్ సిక్స్ హామీ అమలులో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు తదితర హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. ఇది మోసపూరిత ప్రభుత్వం.

–సురేష్ దళిత నాయకుడు, వీరాపురం, అమరాపురం మండలం

సూపర్ సిక్స్ పథకాలేవీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులంతా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కానీ ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా... ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. కూటమి నేతల హామీలు నమ్మి మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. అందరూ మోసపోయారు.

– నాగార్జున, కుంటిమద్ది, రామగిరి మండలం

కేసులతో భయపెడుతున్నారు



చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయలేదు. పైగా హామీలు చేయాలని అడిగే వారిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారు.

– నరసింహమూర్తి, మడకశిర మండలం

ఏడాదంతా 'ఎర్రబుక్కు' పాలనే

- కూటమి సర్కారులో 'రెడ్‌బుక్' అమలు
- వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా అక్రమ కేసులు
- పలువురు అక్రమ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- అక్కడక్కడా దాడులు, గొడవలు, హత్యలు, దోపిడీలు



బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన బొప్పాయి తోట (ఫైల్)



టీడీపీ నేతల దాడిలో గాయపడిన చెన్నక్రిష్టారెడ్డి (ఫైల్)



టీడీపీ రౌడీల దాడిలో చనిపోయిన సతీశ్ (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి.. నారా లోకేశ్ రచించిన 'రెడ్‌బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేసి అడ్డగోలుగా కేసులు పెట్టి వేధిస్తోంది. వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు ఎప్పుడో సోషల్ మీడియాలో చంద్రబాబు, లోకేశ్‌లకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారనే సాకుతో చాలామంది అమాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయించింది.

అక్రమ కేసులు..అకృత్యాలు

పోలీసులను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న టీడీపీ నేతలు.. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించారు. గతేడాది జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజున ప్రారంభమైన పచ్చ నేతల ఆకృత్యాలు... ఏడాది పొడవునా కొనసాగుతూనే వచ్చాయి.

ఓట్ల లెక్కింపు రోజునుంచే

గతేడాది జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు రోజున పుట్టపర్తి గోపురం మెయిన్ రోడ్డులోని గోపాల్‌రెడ్డి క్లినిక్‌పై టీడీపీ అల్లరిమూకలు రాళ్ల దాడి చేశాయి. అదేరోజు తలుపుల మండలం గెరికపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చెన్నక్రిష్టారెడ్డిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

- గతేడాది ఆగస్టు 3న హిందూపురం మండలం గోళ్లాపురం గ్రామానికి చెందిన సతీశ్ అనే వ్యక్తిని టీడీపీ కార్యకర్తలు చితకబాదగా..అతను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఇంతవరకూ నిందితులను అరెస్టు చేయలేదు.
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టారనే కారణంతో కదిరి మండలం వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి, రొద్దం మండలంలో నగరూరు బాలాజీరెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.అరెస్టు పేరుతో తీవ్రంగా వేధించారు.
- ఇక టీడీపీ నేతల బెదిరింపులతో చిలమత్తూరు మండలం ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, రామగిరి మండలం కొత్తపల్లికి చెందిన ముత్యాల్‌నాయక్‌ను ఊరు వదిలి వెళ్లిపోయారు. ఇక ఆర్థికంగా దెబ్బతీసేందుకు పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు చెందిన చీనిచెట్లను, బొప్పాయి చెట్లను, మామిడిచెట్లను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు.



పచ్చమూకల దాడిలో మృతి చెందిన లింగమయ్య (ఫైల్)

రామగిరి ఎంపీపీ ఎన్నికలో గెలవలేక...

రామగిరి ఎంపీపీ ఎన్నికలో గెలవలేని టీడీపీ దుర్మార్గాలకు ఒడిగట్టింది. ఎంపీపీ ఉప ఎన్నికల కోసం అనెక్సర్ 1,2 ఇచ్చేందుకు మార్చి 26న రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు ఓబుగారి హరినాథ్‌రెడ్డి, బోయ రామాంజినేయులు, కురుబ నాగిరెడ్డిపై సుమారు 500 మంది టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. కానీ పోలీసులు బాధితులపైనే కేసు నమోదు చేశారు.

- ఎంపీపీ ఎన్నికలో పాల్గొనేందుకు మార్చి 27 బెంగళూరు నుంచి వస్తున్న పేరూరు-2 ఎంపీటీసీ సభ్యురాలు భారతిని పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు బలవంతంగా కిడ్నాప్ చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపైనే పోలీసులు కేసు నమోదు చేశారు.
- గొడవలు వద్దని చెప్పిన పాపానికి ఉగాది పర్వదినం రోజైన మార్చి 30న రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యపై టీడీపీ రౌడీలు ఇంట్లో దూరి దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన కురుబ లింగమయ్య అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ హెలికాప్టర్‌లో పాపిరెడ్డిపల్లికి చేరుకోగా.. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టలేదు. ఫలితంగా హెలిప్యాడ్ వద్ద తోపులాట జరిగింది. అయితే పోలీసులు తమ వైఫల్యాలను పక్కనబెట్టి.. టీడీపీ నేతలు ఆదేశాల మేరకు విడతల వారీగా ఇప్పటి వరకు సుమారు 200 మందిపై కేసులు నమోదు చేశారు.

ఎవరికెంత ముట్టింది..?

- పుట్టపర్తి ప్రవాస భారతీయుడికి చీటింగ్ కేసులో పోలీసులపైనా విచారణ!
- నిందితుణ్ని వారం రోజులు స్టేషన్‌లో ఎందుకు ఉంచారని ఆరా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రవాస భారతీయుడిని మోసం చేసిన కేసులో నిందితుడి నుంచి భారీగా లబ్ధి పొందిన పోలీసులపైనా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తనకు రూ.12 కోట్లకుపైగా మోసం చేశారని మే 22న ప్రవాస భారతీయుడు మహేంద్రకర్ ఆర్విన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపై పుట్టపర్తి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా నిందితుడిని ఎఫ్ఐఆర్ అనంతరం అరెస్టు చూపకుండా కొంతమంది టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు అతని ఆస్తులను బదలాయించడం, మరికొన్ని ఆస్తులపై అగ్రిమెంట్లు చేయడం జరిగింది. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో టీడీపీ నాయకులతో రూ.50 లక్షలు పుట్టపర్తి పోలీసులు డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ బాగోతంలో ఒక సబ్ డివిజనల్ పోలీసు అధికారి, కొంతమంది పోలీసుల సమక్షంలోనే జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిత్యం సత్యసాయి భక్తులతో కళకళలాడే పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి కూతవేటు దూరంలోనే ఇదంతా జరగడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో పోలీసు అధికారులు విచారణను వేగవంతం చేశారు. రాయ'బేరం'లో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారికి పల్లె రఘునాథరెడ్డి అండదండలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈయన ఏరికోరి సదరు అధికారిని పుట్టపర్తికి తెచ్చుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా డీల్ కుదుర్చుకున్న రూ.50 లక్షల్లో ఉన్నతాధికారులకు ఏమైనా వెళ్లిందా అన్న కోణంలోనూ విచారణ చేస్తున్నట్టు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని విజయవాడకు చెందిన ఓ పోలీసు అధికారి చెప్పారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- హామీలిచ్చి మోసం చేయడం ఆయన నైజం
- బాబు నయవంచనను ప్రజలకు వివరించేందుకే 'వెన్నుపోటు దినం'
- పార్టీనేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొనాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పార్టీ శ్రేణులతో కలిసి 'వెన్నుపోటు దినం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీ చరణ్

గోరంట్ల: 'వెన్నుపోటు' అనే మాట వినిపిస్తేనే చంద్రబాబు గుర్తుకు వస్తారని, వెన్నుపోటుకు ఆయన బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మంగళవారం ఆమె స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ పగడాల వెంకటేశు అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...చంద్రబాబు అసమర్థ పాలనను వివరించడంతో పాటు అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను ఎలా వెన్నుపోటు పొడిచారో వివరించేందుకే బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలో పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన బాబు

'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో చదువుకొనే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని చెప్పిన చంద్రబాబు... అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఇప్పటికీ ఒక్కరూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేశారని ఉషశ్రీచరణ్ దుయ్యబట్టారు. అలాగే అడపడుచుకు నెలకు రూ.1,500 ఇస్తానని మోసం చేశారన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అంటూ గొప్పలు చెప్పిన చంద్రబాబు... నేడు వాటి గురించే మాట్లాడటం లేదన్నారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయానికి అలవాటు పడ్డారన్నారు. గతంలో బిడ్డనిచ్చిన సొంత మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడచి అధికారం చేపట్టారని, ఆ తర్వాత ప్రతి ఎన్నికలోనూ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి రాగానే ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పేదలను వెన్నుపోటు పొడిచిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి చేపడుతున్న యుద్ధంలో ప్రతి కార్యకర్త ముందుండాలని ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. అంతకుముందు ఆమె పార్టీ శ్రేణులతో కలిసి 'వెన్నుపోటు దినం' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, పార్టీ పట్టణ కన్వీనర్ మేదర శంకర, పార్టీ నాయకులు చరణ్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, మండలంలోని పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వర్షాలతో ఒక్కరికీ ఇబ్బంది కలగకూడదు

- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ చేతన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: ఈసారి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, వర్షాల వల్ల ఒక్కరికి కూడా ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా చూడాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలన్నారు. వ్యాధులు విజృంభించకుండా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చూసుకోవాలన్నారు. మెరుపులు, పిడుగుల సమాచారం ముందస్తు అందించాలన్నారు.

మాన్యం భూములను పరిరక్షించాలి

జిల్లాలోని వివిధ దేవాలయాల మాన్యం భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కలెక్టర్ చేతన్ దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్నతో కలిసి దేవదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాన్యం భూములపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ధర్మవరం డివిజన్‌లోనే మాన్యం భూములు ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని కాపాడాలన్నారు.

అధికారంలోకి వచ్చి ఏడాదైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు అమలు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో నాలుగు మహిళలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ఈ నాలుగూ నేటికీ కూటమి సర్కార్ నెరవేర్చలేదని మండిపడుతున్నారు.



ఏదీ బాబూ ఉచిత బస్సు ప్రయాణం?

ఏడాదిగా ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్న మహిళలు

- ప్రకటనలకే పరిమితమైన సూపర్ సిక్స్ పథకాలు
- అదిగో ఇదిగో అంటూ కాలయాపన
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళలు

పుట్టపర్తి టౌన్: టీడీపీ కూటమి అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ముఖ్యమైన హామీ ఉచిత బస్సు ప్రయాణం. అయితే సరిపడా నిధులు లేకపోవడంతో పథకాన్ని అమలులో ప్రభుత్వం చేతులెత్తేసింది. అదిగో... ఇదిగో అంటూ ఏడాదిగా కాలయాపన చేస్తూ వస్తోంది. దీంతో ప్రభుత్వ తీరుపై జిల్లా వ్యాప్తంగా మహిళల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పథకం అమలుపై మీనమీషాలు

పక్కనే ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోపే పాలకులు అమలు చేశారు. కానీ ఏపీలో మాత్రం ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వ పెద్దలు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేమంటే గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడదంటూ నిందలు వేస్తున్నారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టించి ప్రజలకు పంచుతామన్న చంద్రబాబు.. ఇప్పుడు కుంటి సాకులతో ముఖం చాటేయడంతో మహిళల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. చంద్రబాబు అధికారంలో ఉన్నన్నీ రోజులూ తమను మోసం చేస్తూనే ఉన్నారని, గతంలోనూ రుణ మాఫీ పేరుతో బ్యాంకుల్లో తమను డీఫాల్టర్లుగా ముద్రపడేలా చేశారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర పథకాలను అమలు చేయకుండా మరోసారి తమను దాగా చేశారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాను ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేస్తే ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ ఎద్దేవా చేస్తున్నారు.

పథకం అమలుతో 8.45 లక్షల మందికి లబ్ధి

జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల పరిధిలో 8,45,345 మంది మహిళలు ఉన్నారు. వీరిలో చాలా మంది ఉద్యోగులు, విద్యార్థులు, కూలి పనులకు వెళ్లేవారు ఉన్నారు. అలాగే సత్యసాయి మహాసమాధి దర్శనార్థం నిత్యం వందలాది మంది మహిళా భక్తులు వచ్చి వెళుతుంటారు. ఉచిత బస్సు ప్రయాణం అమలుతో వీరందరికీ లబ్ధి చేకూరనుంది. అయితే ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కూలి పనులకు వెళ్లే మహిళలు, విద్యార్థినులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. వైద్య చికిత్సల కోసం జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించే మహిళలు సైతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 6 ఆర్టీసీ డిపోల పరిధిలో 400 బస్సులు ఉండగా, రోజుకు సగటున 1,45,234 మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో మహిళలు 60 వేల మంది వరకు ఉంటున్నారు. దీంతో ఏటా జిల్లాలో మహిళలకు రూ.1.38 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

హామీని నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. మహిళల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారు. ఏడాది గడుస్తున్న అదుగో ఇదిగో అంటూ మభ్యపెడుతున్నారు. ఇలా మోసం చేయడం తగదు. – రామాంజనమ్మ బాయి, గేనేనాయక్ తండా, పుట్టపర్తి

ఎదురు చూస్తున్నాం



చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో తెలియదు. గతంలోనూ డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ అన్నారు. అధికారం చేపట్టిన తర్వాత రుణాలు మాఫీ చేయలేదు. రుణ మాఫీ కోసం ఎదురు చూస్తూ బ్యాంక్‌ల్లో చాలా మంది మహిళలు డీఫాల్టర్లుగా మారారు. ఇప్పటికైనా మహిళలను మోసం చేయకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. – ప్రభావతమ్మ, కొత్తచెరువు

వెసులుబాటు ఉంటుంది



ఉచిత బస్సు ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రంలో చిన్నపాటి పనులు చేసుకుంటున్న మహిళలకు ఎంతో ఆర్థిక వెసులుబాటు ఉంటుంది. ఏడాదిగా ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నాం. ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టంగా చెప్పడం లేదు. – సుశీలమ్మ, పుట్టపర్తి

ఏదీ సమాచారం?.. ఇదేం ఘోరం!

- బదిలీలకు సంబంధించి ఎలాంటి సమాచారమూ బయటకు వెల్లడించని విద్యాశాఖ
- ఆందోళనలో ఉపాధ్యాయులు
- నేడు స్కూల్ అసిసెంట్ల బదిలీలకు వెబ్ ఆప్షన్లు
- ఖాళీలు చూపించలేదంటున్న టీచర్లు


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సంబంధించి విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పూర్తి గోప్యత పాటిస్తుండడంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులకు దరఖాస్తు చేసుకున్నారు. రోజూ 3-4 సార్లు రాష్ట్ర అధికారులు వెబెక్స్‌లు పెట్టుకుంటూ వివిధ అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇవేవీ క్షేత్రస్థాయిలో ఉండే టీచర్లకు చేరడం లేదు. కనీసం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్న గ్రూపుల్లో షేర్ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పోనీ మీడియా ద్వారానైనా ఉపాధ్యాయులకు తెలియజేసే ప్రయత్నాలు చేయకపోవడంపై టీచర్లు మండిపడుతున్నారు. పొరుగు జిల్లాలకు సంబంధించి రోజూ స్వయంగా డీఈఓల పేరుతోనే వివిధ మెసేజ్‌లు టీచర్ల గ్రూపుల్లో వైరల్ అవుతున్నాయి తప్ప మన జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా సీనియార్టీ జాబితాలు, ఖాళీల విషయం ఏమాత్రం బయటకు చెప్పడం లేదు. రెండు రోజుల కిందట పీఎస్‌హెచ్‌ఎంల బదిలీలయ్యాయి. ఆయా సబ్జెక్టుల్లో మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు పీఎస్‌హెచ్‌ఎంలుగా మంగళవారం బదిలీలు చేశారు. అయితే ఎంతమంది పీఎస్‌హెచ్‌ఎంలుగా వెళ్లారు...ఏయే సబ్జెక్టుల వారు వెళ్లారు...వీరిలో తప్పనిసరి బదిలీలయ్యేవారు, రెక్వెస్ట్ బదిలీలయ్యారు? అనే సమాచారం రాత్రి 10 గంటలు దాటినా బయటకు చెప్పలేదు.

ఖాళీలు చూపించకుండానే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలట!

స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఖాళీలు ప్రదర్శించకుండానే బుధవారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని చెబుతున్నారంటూ టీచర్లు వాపోతున్నారు. సీనియార్టీ జాబితా, ఖాళీలు ప్రకటించిన తర్వాత అభ్యంతరాలకు గడువు ఇవ్వడం లేదంటున్నారు. బత్తలపల్లి బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ టీచరు జనవరిలో రిటైర్డ్ అయ్యారు. ఆమె పోస్టు ఖాళీ చూపించలేదు. ఇక్కడ హిందీ ఒక పోస్టు ఖాళీగా ఉంటే రెండు పోస్టులున్నట్లు చూపించారు. ఉన్న ఖాళీలను చూపించకుండా స్కూళ్లు కోరుకుంటే జరిగే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ టీచర్లు వాపోతున్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి టౌన్: కడపలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి చేపట్టిన అడ్మిషన్లకు ఈ నెల 19తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలి. బాలికలకు 40, బాలురుకు 40 సీట్లు ఉన్నాయి. 8 నుంచి పదేళ్ల వయస్సు కలిగిన బాలబాలికలు అర్హులు. పూర్తి వివరాలకు https://apsportsschool.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

కూటమిలో విభేదాలు బహిర్గతం

- అనంతలో ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న పోలీసులు
- పల్లె రఘునాథరెడ్డి అవినీతిపై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు
- పోలీసుల అండతో అడ్డుకున్న పల్లె అనుచరులు


బీజేపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో కూటమిలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. టీడీపీకి చెందిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అవినీతి అక్రమాలను బహిర్గతం చేస్తానని బీజేపీకి చెందిన ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మంగళవారం అనంతపురం నగరంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. అలాగే రుద్రంపేట సర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి బీసీలను పల్లె వంచిస్తున్న తీరుపై చర్చించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఫంక్షన్ హాల్ వద్దకు ఆయన చేరుకోగానే పెద్ద సంఖ్యలో పల్లె అనుచరులు అక్కడకు చేరుకుని భయభ్రాంతులకు గురి చేశారు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. నడిరోడ్డుపైనే తోపులాట చోటు చేసుకుంది. ప్రెస్‌మీట్, రౌండ్‌టేబుల్ సమావేశం విరమించుకుని వెళ్లకపోతే దారుణమైన పరిస్థితులు చూడాల్సి ఉంటుందని పల్లె అనుచరులు హెచ్చరికలు జారీ చేశారు. ఇంతలోనే పల్లె రఘునాథరెడ్డికి మద్దతుగా అక్కడకు చేరుకున్న పోలీసులు ఎలాంటి ప్రెస్‌మీట్‌లు పెట్టడానికి వీల్లేదంటూ ఆదినారాయణయాదవ్‌ను అడ్డుకున్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పల్లె రఘునాథరెడ్డి భూమిని కబ్జా చేశారని ఆదినారాయణ యాదవ్ ఆరోపించారు. అల్లరిమూకలను రెచ్చగొట్టి పదేపదే బీసీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సోలార్ ప్రాజెక్ట్ కోసమని 100 ఎకరాల గిరిజనుల భూమిని ఆదినారాయణ యాదవ్ లాక్కొన్నారని పల్లె అనుచరులు ఆరోపించారు. ఇలా ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ కూటమిలోని విభేదాలను బయటపెట్టారు.

ఇరువర్గాల ఘర్షణ – పలువురికి గాయాలు


గాయపడిన గోవర్ధన్

బత్తలపల్లి: భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామంలోని చిన్న కొట్టాలలో నివాసముంటున్న ఏడుగురు అన్నదమ్ములకు గాను నలుగురు (వీరయ్య, చిన్నప్ప, శివయ్య, గాలెప్ప) సర్వే నంబర్ 390లోని భూమిని 40 సంవత్సరాల క్రితం భాగపరిష్కారం చేసుకున్నారు. ఇందులో 390-1ఏ లో 75 సెంట్లు, 390-1జీ లో 50 సెంట్లు భూమిని చిన్నప్ప అనుభవిస్తున్నారు. చిన్నప్ప మరణానంతరం ఆయన కుమారులు శివప్రసాద్, గోవర్ధన్ సాగు చేస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత సూర్యప్రకాష్‌రావు అండతో ఆ భూములను తమ పేరుపై మార్పు చేసుకునేందుకు వీరయ్య, శివయ్య, గాలెప్ప, వారి కుమారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పంచాయితీకి రమ్మని సూర్యప్రకాష్‌రావు ఆహ్వానించినా శివప్రసాద్, గోవర్ధన్ వెళ్లలేదు. దీంతో తహసీల్దార్‌పై ఒత్తిడి తీసుకెళ్లి మంగళవారం సర్వేకు సిద్ధమయ్యారు. ఈ విషయంగా సోదరులు అభ్యంతరం తెలపడంతో అధికారులు వెనుదిరిగారు. ఆ తరువాత శివయ్య, రమేష్, ఈరయ్య, శివశంకర్, గాలెప్ప అలియాస్ బాలు, సుకన్య కలిసి భూమిలో హద్దు రాయిని దౌర్జన్యంగా తొలగిస్తుండగా శివప్రసాద్, గోవర్ధన్ తమ వద్ద సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. విషయాన్ని గమనించిన ప్రత్యర్థులు వెంటనే కట్టెలతో దాడికి తెగబడ్డారు. శివప్రసాద్, గోవర్ధన్, ఈశ్వరమ్మ, నందిని గాయపడ్డారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేత సూర్యప్రకాష్‌రావు ప్రోద్బలంతోనే తమపై దాయాదులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

డీజిల్ అక్రమ డంప్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న డీజిల్‌ను చూపుతున్న పోలీసులు

- లారీల నుంచి యథేచ్ఛగా డీజిల్ అపహరణ
- దందాతో రూ.కోట్లలో అక్రమార్జన

చెన్నేకొత్తపల్లి: డీజిల్ చోరీ దళారులకు కాసుల పంట పండిస్తోంది. ధాబాల వద్ద, రోడ్డు పక్కన నిలిపిన లారీల నుంచి చోరీ చేసిన డీజిల్ అక్రమంగా ఓ ప్రాంతంలో డంప్ చేసి గ్రామీణులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్న వైనం వెలుగు చూసింది. జిల్లాలో అక్రమంగా సాగుతున్న ఈ దందాలో ఇద్దరు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు.

లారీ డ్రైవర్ ఫిర్యాదుతో వెలుగులోకి

సోమవారం రాత్రి ప్రయాణిస్తున్న ఓ లారీ డ్రైవర్ నిద్ర ముంచుకు రావడంతో చెన్నేకొత్తపల్లి శివారున 44వ జాతీయ రహదారి పక్కన తన లారీని ఆపి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం లారీని శుభ్రం చేస్తుండగా డీజిల్ ట్యాంక్ వేసిన తాళం బద్దలుగొట్టి ఉండడం గమనించాడు. ట్యాంక్‌లోని డీజిల్ మొత్తం అపహరించినట్లుగా గుర్తించి, విషయాన్ని వెంటనే చెన్నేకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్రమత్తమైన ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలసి ఉదయం 44వ జాతీయ రహదారిపై దామాజిపల్లి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చెన్నేకొత్తపల్లి వైపుగా వస్తున్న కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన కారును ఆపి పరిశీలించగా... అందులోని క్యాన్లలో 90 లీటర్ల డీజిల్‌ను గుర్తించి డ్రైవర్ బసవరాజును అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో బయటపడిన వాస్తవం

తమ అదుపులో ఉన్న డ్రైవర్ బసవరాజును పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. హంద్రీ-నీవా కాలువ వద్ద పనులు చేపట్టిన వాహనాల నుంచి సోమవారం రాత్రి డీజిల్ అపహరించుకుని వస్తున్నట్లుగా పోలీసుల ఎదుట బసవరాజు అంగీకరించాడు. దొంగిలించిన డీజిల్‌ను రామగిరి మండలం పెనుబోలు వద్ద ఉన్న రాము అనే వ్యక్తికి అప్పగించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా వివరించాడు. దీంతో పోలీసులు వెంటనే పెనుబోలుకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. రామును అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. స్థానికుడైన అంకిత్‌తో కలసి డీజిల్ దందా సాగిస్తున్నట్లుగా రాము అంగీకరించడంతో అంకిత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాము ఇంటి వెనుక ఉన్న పొలంలో డ్రముల్లో నిల్వ చేసిన 1,500 లీటర్లను గుర్తించి, రామగిరి సీఐ శ్రీధర్‌కు తెలపడంతో ఆయన అక్కడకు చేరుకుని సమగ్ర విచారణ అనంతరం నిల్వ చేసిన డీజిల్ డ్రమ్ములను పీఎస్‌కు తరలించారు. రాము, అంకిత్‌తో పాటు డ్రైవర్ బసవరాజుపై కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా, ఈ అక్రమ దందాలో నిందితులు రూ.కోట్లు వెనకేసున్నట్లుగా ఆరోపణలున్నాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ


తీవ్రంగా గాయపడిన రామాంజులు

తనకల్లు: మండలంలోని గంగసానివారిపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మదనపల్లి నుంచి కదిరికి ప్రయాణికులతో వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న కదిరికి చెందిన కుమార్, లక్ష్మీనారాయణ, మొలకలచెరువు నివాసి ఉత్తన్న, వేపలపల్లికి చెందిన రామాంజులు, పాలెంవాండ్లపల్లి వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను చికిత్స కోసం తనకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉన్న రామాంజులు, కుమార్‌ను కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


మృతురాలు గండ్లూరి సాలమ్మ

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం జానకంపల్లి గ్రామానికి చెందిన గండ్లూరి సాలమ్మ(106) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమెకు ముగ్గురు సంతానం కాగా, ఒకరైన అమరదీప్ అశ్వత్థరెడ్డి ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీలో గుర్తింపు పొందిన నేతగా ఉన్నారు. మరణించే అరగంట ముందు వరకూ ఆమె ఎంతో ఉత్సాహంగా కుటుంబసభ్యులతో గడిపారు. సాలమ్మ మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత కొత్తకోట సోమశేఖరరెడ్డి, జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు జానకంపల్లికి చేరుకుని ఆమె భౌతికకాయనికి నివాళులర్పించారు.

రైతు అనుమానాస్పద మృతి


మృతుడు లక్కప్ప

పావగడ: తాలూకా పరిధిలోని చెన్నమరెడ్డిహళ్లికి చెందిన రైతు కురుబ లక్కప్ప(65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం గ్రామం నుంచి గుమ్మఘట్టకు వెళ్లే మార్గంలోని నిర్జన ప్రదేశంలో చెట్టుకు వేసుకున్న ఉరికి విగత జీవిగా వేలాడుతున్న లక్కప్పను గుర్తించిన స్థానికుల సమాచారంతో పావగడ పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సోమవారం రాత్రి ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినా... మృతుడి ముఖంపై గాయాలు, చొక్కాపై రక్తపు మరకలు ఉండడంతో కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


ఆకాశంలో తేలిపోతున్న మేఘాలు


ధర్మవరం సమీపంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

జాలి లేని నీలి మేఘం

నైరుతి ప్రభావం కారణంగా ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా... ఉమ్మడి అనంత జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రోజూ ఊరిస్తున్న మేఘాలు... కాసేపటికే తేలిపోతున్నాయి. ఇప్పటికే పొలాలను దుక్కి చేసి విత్తుకు రైతులు సిద్ధం చేశారు. అయినా వరుణుడు కరుణించకపోవడంతో ఆకాశంలో మబ్బుల వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:


కొత్తచెరువు సమీపంలో పొలాల్లో ఎరువు కుప్పలు వేసిన దృశ్యం